# సాక్షి అనంతపురం

శనివారం । 14 । జనవరి । 2023






## పవన్ కంటే పాల్ నయం

జనసేన అధినేత పవన్ కన్నా కేఏ పాల్ ఎంతో నయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా అన్నారు. IIలో



## టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టం రూ.12, కనిష్టం రూ.3, సరాసరి రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/09.2°

జిల్లా అంతటా శుక్రవారం చలి తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి తక్కువగా నమోదయ్యాయి.

## న్యూస్‌రీల్

### అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం



ఉత్తమ వైద్యులతో కలెక్టర్ నాగలక్ష్మి

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** అందరూ ఆరోగ్యంగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు, పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉత్తమ వైద్యసేవలు అందించిన వైద్యులను కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో అవార్డులు అందజేసి, సన్మానించారు. డాక్టర్ నవీన్ (నాగసముద్రం పీహెచ్‌సీ), డాక్టర్ సందీప్ (బేతాపల్లి పీహెచ్‌సీ), డాక్టర్ లక్ష్మీనారాయణ (కూడేరు పీహెచ్‌సీ), డాక్టర్ ఉష (పెద్దపప్పూరు పీహెచ్‌సీ), డాక్టర్ గౌతమి (గార్లదిన్నె పీహెచ్‌సీ) అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ అధికారి డాక్టర్ సుజాత, డిప్యూటీ డెమో త్యాగరాజు, 104 మేనేజర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### ఆర్‌ఐ సరెండర్

**కూడేరు:** రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) వరలక్ష్మిని కలెక్టరేట్‌కు సరెండర్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ శుక్రవారం తెలిపారు. భూపంపిణీ దరఖాస్తులకు సంబంధించి పూర్తిస్థాయిలో జాబితా సిద్ధం చేయడంలో జాప్యం చేయడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉన్నతాధికారులకు సరెండర్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

**ఆర్‌ఐ పోస్టులు ఖాళీ..**

తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రెండు ఆర్‌ఐ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆర్‌ఐ-1 విజయ్‌కుమార్‌కు గత నెలలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు పదోన్నతి కల్పించి ఇదే మండలానికి పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా ఆర్‌ఐ-2 వరలక్ష్మిని కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు.

### ఇన్‌చార్జ్ డీఈఓగా కృష్ణయ్య



కృష్ణయ్య



బి.ప్రతాప్‌రెడ్డి

**అనంతపురం:** విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కృష్ణయ్య ఇన్‌చార్జ్ డీఈఓగా నియమితులయ్యారు. ఇది వరకు ఇన్‌చార్జ్ డీఈఓగా ఉన్న కడప ఆర్జేడీ ఎం.వెంకటకృష్ణారెడ్డిని మోడల్ స్కూళ్ల జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌గా ఉన్న బి.ప్రతాప్ రెడ్డికి కడప ఆర్జేడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

అనంతపురంలో రంగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



రేగుపండ్లు కొనుగోలు



# సంతోషాల సంక్రాంతి

- మూడు రోజుల పండుగ
- వాడవాడలా రంగవల్లులు
- భోగి పండుగకు సర్వం సిద్ధం
- ఇంటింటా సంక్రాంతి సందడి




**అనంతపురం కల్చరల్:** సంక్రాంతి సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించేందుకు ప్రతి లోగిలీ ముస్తాబైంది. కొత్త అల్లుళ్ల రాక... పిండి వంటల సువాసన, గంగిరెద్దుల గజ్జల చప్పుళ్లు, చిన్నారుల గాలిపటాలు, జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. ముత్యాల ముగ్గులు స్వాగతం పలుకుతుండగా.. ముంగిట గొబ్బెమ్మలు ముచ్చట గొలుపుతున్నాయి. శనివారం భోగి, ఆదివారం మకర సంక్రాంతి, సోమవారం కనుమ పండుగల నేపథ్యంలో అనంతపురం నగరంతో పాటు, జిల్లాలోని పలు మండల, పట్టణ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

**శిల్పారామంలో నేటి నుంచి సంబరాలు**

అనంతపురం శిల్పారామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తెలిపారు. 14న అమృత కూచిపుడి నృత్య కళా నిలయం, 15న యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూచిపుడి నృత్య ప్రదర్శనలు, 16న చిన్నారులతో పతంగులు ఎగురవేసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

### సంక్రాంతి అంటే రైతుల పండుగ



మా చిన్నప్పుడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే రైతులందరూ ఎంతో ఇష్టంతో మూడు రోజుల పాటూ ముచ్చటగా జరుపుకునేవాళ్లం. పట్టణ నాగరికత పల్లెకు చేరిన తర్వాత క్రమంగా మందగించినా విరివిగా కురిసిన వానలు, ప్రభుత్వాలు అందిస్తున్న ప్రత్యేక పథకాలతో సంక్రాంతి మరోసారి రైతుల కళ్లలో ఆనందాలను తెచ్చిపెట్టింది. దివంగత నేత వైఎస్సార్ సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఆ ఒరవడే నేటికీ కొనసాగుతోంది. వ్యవసాయం దండగ కాదని పండుగగా భావించే విధంగా రైతులను వెన్నుతట్టి పలకరించే సంక్రాంతి అంటే మా ఇంటిల్లిపాదికి ఎంతో ఇష్టం.

– మేకల శివశంకరరెడ్డి, ఆదర్శ రైతు, ప్రసన్నాయపల్లి

### సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట



తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలను ఈతరం వారు మరచిపోకుండా ఉండాలనే సంక్రాంతిని అందరి మధ్య జరుపుకుంటున్నాం. ముఖ్యంగా ఆరోగ్యసూత్రాలనందించే రంగవల్లులను ప్రతి ఇంటా సందేశాత్మకంగా ఉండేలా చేస్తున్నాం. భోగిపండ్లు పోయించడం, భోగి మంటలు, సంప్రదాయంగా గోదా రంగనాథుల కల్యాణం, బసవన్నల సందడి సాగేలా సంస్కారభారతి తరఫున చేస్తున్నాం. సంక్రాంతి పండుగ వచ్చిందంటే సాధారణంగా పల్లెలు మాత్రమే జరుపుకునే రోజుల నుంచి పట్టణాలలో సైతం ఉత్సాహంగా సాగడానికి స్వచ్ఛంద సంస్థలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

– లక్ష్మి, ప్రధాన కార్యదర్శి, సంస్కారభారతి

### మంత్రి సంక్రాంతి శుభాకాంక్షలు



కేవీ ఉషశ్రీచరణ్

**కళ్యాణదుర్గం:** రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో జీవించాలని, రైతులు సిరి సంపదలతోమార్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

- అనంతపురం రేంజ్ పరిధిలోని ప్రజలకు డీఐజీ ఎం.రవిప్రకాష్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జోలికి వెళ్లకుండా భోగి, మకర సంక్రాంతి, కనుమలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.
- జిల్లా ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. ప్రతి ఇంటా సంక్రాంతి కాంతులు వెల్లివిరియాలని, పాడిపంటలు, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.

### సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** సంక్షేమ పథకాల లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు దోపిడీకి తెరలేపారని ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. వివరాలు, ఓటీపీ గురించి చెప్పరాదని, ఒక వేళ ఎవరైనా వారి మాటలు నమ్మి చెబితే ఖాతాలో సొమ్ము ఖాళీ అవుతుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలు తెలుసుకుని వారి మొబైల్ నంబర్లకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాల పేర్లు చెప్పి తాము ప్రధాన కార్యాలయాల నుంచి మాట్లాడుతున్నామని ఏమారుస్తారని, డబ్బు జమ చేయడానికి వివరాలు తెలపాలంటూ కూపీ లాగుతారని.. వారి మాటలు నమ్మితే నిలువునా మోసపోయినట్లేనని అప్రమత్తం చేశారు. అనుమానిత కాల్స్ వచ్చినప్పుడు నేరుగా కార్యాలయాలకు వెళ్లి వివరాలు ఇస్తామని స్పష్టంగా చెప్పి ఫోన్ పెట్టేయాలని సూచించారు. ఎవరైనా సైబర్‌నేరగాళ్ల బారినపడి మోసపోతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# తీరిన సబ్జెక్టు టీచర్ల కొరత

- 985 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు

**అనంతపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 985 మంది ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్లుగా అవకాశం కల్పించింది. వీరిలో 2022 అక్టోబర్‌లో పదోన్నతి ఆసక్తి తెలిపిన 191 మంది సీనియర్ ఎస్జీటీలు ఉన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తికి అనుగుణంగా లెక్కించి మిగిలిన పోస్టులు (సర్‌ప్లస్) 652, సబ్జెక్టు మార్పు 142 రెండూ కలిపి 794 (ఉదాహరణకు స్కూల్ అసిస్టెంట్ మేథమేటిక్స్ నుంచి ఫిజిక్స్, ఇంగ్లిష్ నుంచి స్కూల్ అసిస్టెంట్) చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లను, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ఆసక్తి తెలిపిన 191 మంది మొత్తం 985 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. దీంతో విద్యార్థులకు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయుల కొరత తీరినట్లయ్యింది.



పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ వెంకటకృష్ణారెడ్డి

**ముగిసిన కౌన్సెలింగ్**

అనంతపురం సైన్స్ సెంటర్‌లో గత అక్టోబర్‌లో పదోన్నతికి సమ్మతి తెలిపిన టీచర్లకు స్థానాలు కేటాయించే కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. సీనియార్టీ ప్రకారం పారదర్శకంగా పోస్టింగ్‌లు కేటాయించారు. కౌన్సెలింగ్‌ను అనంతపురం ఇన్‌చార్జ్ డీఈఓ వెంకటకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, అనంతపురం డీవైఈఓ పద్మప్రియ, పెనుకొండ డీవైఈఓ రంగస్వామి పాల్గొన్నారు.

### కొనసాగుతున్న చలి తీవ్రత

**అనంతపురం అగ్రికల్చర్:** చలి తీవ్రత కొనసాగుతోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోయాయి. రాత్రి, వేకువజాము వేళల్లో చలి ఎక్కువగా ఉంటుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 8.2 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 9.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక అగళి 8.5 డిగ్రీలు, నల్లచెరువు 9.2, శెట్టూరు, తనకల్లు 9.4, రొద్దం 9.5, గాండ్లపెంట 9.7, సోమందేపల్లి, కొత్తచెరువు 9.8, కనగానపల్లి 10.2, ఎన్‌పీ కుంట 10.3, ఓడీ చెరువు 10.4, కూడేరు 10.6, రాప్తాడు, విడపనకల్లు 10.7, హిందూపురం, లేపాక్షి, కంబదూరు, తలుపుల 10.8, గుడిబండ 10.9 డిగ్రీల కనిష్టం నమోదు కాగా.. మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య కొనసాగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో చలి వాతావరణం అధికంగా నెలకొంది. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

### 16న 'స్పందన' ఉండదు

**అనంతపురం అర్బన్:** కనుమ పండుగ సందర్భంగా ఈనెల 16న (సోమవారం) ప్రభుత్వం ప్రకటించిందని, అందువల్ల ఆ రోజు 'స్పందన' కార్యక్రమం నిర్వహించడం లేదని డీఆర్‌ఓ గాయత్రిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించాలని సూచించారు.

# పవన్ కంటే కేఏ పాల్ నయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

**తాడిపత్రి:** ఏపీ రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక విష పురుగులా తయారయ్యారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. శుక్రవారం తాడిపత్రిలోని పైలా నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలపై సరైన అవగాహన లేని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కంటే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఎంతో నయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామస్మరణ చేయనిది పవన్‌కు నిద్ర పట్టని పరిస్థితి నెలకొందన్నారు. తన స్వార్థం కోసం జనసేన కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న పవన్ ఉన్మాదిలా తయారవుతున్నారన్నారు. చెప్పులతో కొట్టండి.. దాడులు చేయండి ..జైలుకు వెళ్లండి.. ప్రాణ త్యాగాలు చేయండి అంటూ జనసేన కార్యకర్తలను ఉద్దేశించి చేస్తున్న వాఖ్యలు తమలోని బజారు రౌడీని బయటకు తెస్తున్నాయన్నారు. అమాయక ప్రజలు, సినిమా అభిమానులను, కార్యకర్తలు, యువతను పెడదోవ పట్టించి తన పబ్బం గడుపుకునేందుకు పవన్ కళ్యాణ్ యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్యాకేజీ కోసం కాపు కులాన్ని, అభిమానులను అడ్డం పెట్టుకొని ఉన్మాదిలా తయారైన పవన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డితో పోరాడాను అంటూ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు. పవన్ వ్యాఖ్యలను చూస్తుంటే పిచ్చి ముదిరి పాకాన పడినట్లుందని, ఎప్పుడు ఎవరితో కలిసి ఉంటాడో, ఎప్పుడు విడిపోతాడో, ఎప్పుడు ఏం మాట్లాడుతాడో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని తెలిపారు. జనసేన పార్టీని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దగ్గర తాకట్టు పెట్టిన పవన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును ఉచ్చరించే అర్హత కూడా లేదన్నారు. సొంతంగా పార్టీని స్థాపించి 151 మంది ఎమ్మెల్యేలను, 22 మంది ఎంపీలను ఒంటి చేత్తో గెలిపించిన ముఖ్యమంత్రి కాలి గోటికి కూడా పవన్‌కళ్యాణ్ సరిపోడని విమర్శించారు. 2024 ఎన్నికల్లో కలిసి వచ్చినా, గుంపులుగా వచ్చినా, పవన్‌కు రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. అదే సమయంలో ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా పట్టాభిషేకం చేస్తారని జోస్యం చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి పనులపై అందరూ సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు

## ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్

**అనంతపురం రూరల్:** విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం మండలం ఆలమూరు గ్రామ కార్యదర్శి (గ్రేడ్-6) సాయితరుణ్, రుద్రంపేట సచివాలయ-4 సెక్రటరీ (గ్రేడ్-5) విష్ణువర్ధన్‌రెడ్డి గత జూన్ నుంచి విధులకు రావడం లేదు. కుందుర్పి మండలం అప్పిలేపల్లి పంచాయతీ కార్యదర్శి రాజప్పను సాధారణ బదిలీల్లో భాగంగా రాయదుర్గం మండలం వేపరాళ్లకు బదిలీ చేసినా విధులకు హాజరు కాలేదు. దీంతో ఈ ముగ్గురినీ సస్పెండ్ చేసినట్లు డీపీఓ వెల్లడించారు.

## ఫలితాలు సకాలంలో ఇవ్వాలి

**ఉరవకొండ:** వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల తాలూకు ఫలితాలు సకాలంలో రైతులకు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఉరవకొండ మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఉన్న వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను వారు తనిఖీ చేశారు. భూసార పరీక్షల ఫలితాలను ఆలస్యం లేకుండా వెంటనే రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, అగ్రి ల్యాబ్ ఏఓ షేకన్న, ఏఈఓ ప్రియాంక పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

**యాడికి:** విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పుప్పాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్ వివరాల మేరకు ... పుప్పాలకు చెందిన తిమ్మారెడ్డి యాదవ్‌కు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు అశోక్ కుమార్ (22) గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఇందులో భాగంగానే బోరుబావికి ఉన్న మోటార్‌ను ఆన్ చేసేందుకు స్టాటర్ పెట్టెను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అశోక్ తిరిగి ఇంటికి రాకపోవడంతో శుక్రవారం ఉదయం తోటకు వెళ్లి చూడగా విద్యుత్ వైర్లపై అశోక్ కుమార్ పడి ఉండటాన్ని గమనించి కన్నీరు మున్నీరయ్యారు. విగత జీవిగా పడివున్న అశోక్‌పై పడి తల్లి, కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# మృగాళ్లను వదలొద్దు

- పోక్సో కేసుల్లో వెంటనే చార్జ్‌షీట్లు దాఖలు చేయండి
- టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్పీలకు డీఐజీ ఎం.రవిప్రకాష్ ఆదేశం



**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించిన పోక్సో కేసుల్లో చార్జ్‌షీట్ త్వరితగతిన దాఖలు చేసి మృగాళ్లకు శిక్షపడేలా చూడాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ఎస్పీలను ఆదేశించారు. శనివారం రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ ఆదేశాల మేరకు గత ఏడాది నమోదైన పోక్సో కేసుల్లో చార్జ్‌షీటు దాఖలు చేయాల్సిన అంశం, యూఐ, డ్రగ్స్ కేసులపై డీఐజీ సమీక్ష నిర్వహించారు. పిల్లలపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించి ప్రతి ఎస్పీ ఐదు కేసులు, డీఎస్పీలు చెరో ఐదు కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షించి కోర్టుల్లో ముద్దాయిలకు శిక్షలు పడేలా అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. ఒకటి కంటే ఎక్కువగా పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై షీట్స్ ఓపెన్ చేసి నిఘా ఉంచాలని సూచించారు. నాలుగు జిల్లాల్లో డీఎస్పీలు జడ్జీలను కలిసి సీసీ నంబర్లు తీసుకునేలా ఎస్పీలు పర్యవేక్షించాలన్నారు. యూఐ (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులు తగ్గించాలన్నారు. యూఐ కేసుల విషయమై డీఎస్పీలు, సీఐలతో ఎస్పీలు సమావేశమై ఆదేశాలు జారీ చేయాలన్నారు. డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం, కొనుగోలు వరకు సంబంధమున్న అందరిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు కంటే ఎక్కువ కేసుల్లో ఉన్న నిందితులపై డ్రగ్స్ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. రేంజ్ పరిధిలోని ముఖ్యమైన పట్టణాల్లో డ్రగ్స్ రహితంపై అవగాహన కల్పిస్తూ డిగ్రీ, ఇంజినీరింగ్, తదితర కళాశాలలు, విశ్వవిద్యాలయాల వద్ద హోర్డింగులు పెట్టాలన్నారు. డ్రగ్స్ వల్ల జరిగే చెడు, దుష్ప్రభావాలను తెలియజేస్తూ పోస్టర్లను కళాశాలల ఆవరణలో అతికించాలన్నారు. ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు కళాశాలలను సందర్శించి డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలన్నారు. రౌడీలు పేట్రేగి దుడుకు చర్యలకు పాల్పడితే పీడీ యాక్టు ప్రయోగించాలని ఆదేశించారు. సంక్రాంతి సందర్భంగా జల్లికట్టు, కోడి పందేలు, బెట్టింగులు, గ్యాంబ్లింగులు జరగకుండా చూడాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు ఫక్కీరప్ప, రాహుల్ దేవ్‌సింగ్, పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో గుప్త నిధుల ముఠా


షేక్‌నిజాముద్దీన్ స్వామీజీ


తవ్వకాల ప్రాంతంలో ఉంచిన అమ్మవారి విగ్రహం


సోమగుట్టపల్లి వద్ద జేసీబీతో తవ్వకాలు చేపట్టిన దృశ్యం

- నల్లమాడ, సోమగుట్టపల్లి వద్ద తవ్వకాలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం సోమగుట్టపల్లి అటవీ ప్రాంతం దగ్గర గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారంమేరకు... శ్రీసత్యసాయి జిల్లాలోని నల్లమాడ మండలం సోమగుట్టపల్లి వద్ద భారీగా గుప్త నిధులున్నట్లు కర్ణాటకకు చెందిన స్వామీజీ షేక్ నిజాముద్దీన్ ద్వారా ఓ ముఠా తెలుసుకుంది. ఈ గుప్త నిధులను తవ్వేందుకు అనంతపురం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న మాజీ కానిస్టేబుల్ ఇంటిని కేంద్రంగా చేసుకుని పక్కా ప్రణాళిక రచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఈ ముఠాకు సంబంధించిన సభ్యులు రెండురోజుల పాటు అనంతపురంలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం అనంత నుంచి బయలుదేరి వెళ్లిన ముఠా సభ్యులు స్వామీజీ చెప్పిన ప్రకారం గుప్తనిధులు ఉన్నాయని భావించిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారి విగ్రహాన్ని అక్కడ పెట్టి కొన్ని కెమికల్స్‌తో పూతలు పూశారు. అనంతరం సమీప ప్రాంతానికి చెందిన శంకరరెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన మనుషులతో పాటు మరొకరికి చెందిన జేసీబీని తీసుకుని అమ్మవారి విగ్రహం పెట్టిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టారు. అటవీ ప్రాంతం కావడం, జనసంచారం పెద్దగా లేకపోయినా గొర్రెల కాపరులు, పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకునే వారు జేసీబీ తవ్వకాల శబ్దాలు విని నల్లమాడ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అటు వైపుగా వెళ్తుండగా... పోలీసు ఉన్నతాధికారులకు సైతం సమాచారం తెలియడంతో వారి సహకారంతో వాహనాల తనిఖీ కూడా చేపట్టారు. తనిఖీలు ముమ్మరం కావడంతో నిందితులు ములకవేముల వైపు తప్పించుకుని వెళ్లారు. కాగా అక్కడ మరో పోలీసు బృందం కంటపడిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ స్వామీజీతో పాటు శంకరరెడ్డి, మరికొందరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులో ఓ మాజీ ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు, అతని కుమారుడు స్వామిజీతో కలసి తీయించుకున్న ఫొటోలు లభ్యమయ్యాయి. దీనికి తోడు నిందితులంతా అనంతపురం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ మాజీ కానిస్టేబుల్ ఇంట్లో తల దాచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడికావడంతో ఆ దిశగా శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా కర్ణాటక స్వామీజీ నిజాముద్దీన్‌తో పాటు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మాజీ కానిస్టేబుల్ కుమారుడు కూడా పట్టుబడిన వారిలో ఉన్నట్లు సమాచారం.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గొల్ల నాగేశ్వరరావు (ఫైల్)

**పామిడి:** మండలంలోని పొగరూరు దగ్గర శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్ల నాగేశ్వరరావు (58) చనిపోయారు. ఎస్ఐ షేక్ చాంద్‌బాషా తెలిపిన వివరాలమేరకు.. పొగరూరుకు చెందిన గొల్ల నాగేశ్వరరావు వేకువజామునే బహిర్భూమి కోసం 44వ నంబర్ జాతీయ రహదారిపైన ఉన్న వంతెన వద్దకు బయలుదేరాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న గజరాంపల్లి గ్రామ నుంచి కార్తీక్‌రెడ్డి అనే వ్యక్తి వాహనం అదుపు తప్పడంతో నాగేశ్వరరావును ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ నాగేశ్వరరావును హుటాహుటీనా అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. గ్రామ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన మృతుడు నాగేశ్వరరావు భార్య వెంకటలక్ష్మి ఏడాది క్రితమే చనిపోయారు. మృతునికి ముగ్గురు కుమారులున్నారు. వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఫ్యాక్టరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

- రూ.50 లక్షల ఆస్తి నష్టం


అగ్నికి ఆహుతైన టైర్ రీ బటన్ వర్క్స్ ఫ్యాక్టరీ

**రాప్తాడు:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టైర్ రీ బటన్ వర్క్స్ ఫ్యాక్టరీ అగ్నికి ఆహుతైన ఘటన రాప్తాడులో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... అనంతపురానికి చెందిన ఇస్మాయిల్ అతని కుమారుడు రోషన్ జమీర్ మూడేళ్ల క్రితం రాప్తాడు సమీపంలోని ఆటోనగర్‌లో షాపు నంబర్ 125లో అస్లమ్ టైర్ రీ బటన్ వర్క్స్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసుకున్నారు. జేసీబీ, ట్రాక్టర్, లారీ, ఐచర్, బొలెరో వాహనాల టైర్లను రీ బటన్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే గురువారం రాత్రి ఫ్యాక్టరీలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. ఉదయం వచ్చి తలుపులు తెరవగా ఫ్యాక్టరీలో మంటలు రావడం గమనించారు. స్థానికులు వచ్చి మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే ఫ్యాక్టరీలోని మిషనరీ, టైర్లు పూర్తిగా కాలిపోయాయి. ఫ్యాక్టరీపై కూడా కప్పు కూలిపోయింది, సుమారుగా రూ.50 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

# ధనాధన్ టోర్నీకి వేళాయె..

**సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం**

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

**టోర్నీ ఫార్మాట్..**

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

**ఎంట్రీ ఫీజు..**

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

**ఏ ఏ విభాగాల్లో...**

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

**ఎన్ని జట్లకు అవకాశం..**

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్,హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు **9912220717**

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

## 18 నుంచి రహదారి భద్రతా వారోత్సవాలు

**అనంతపురం సెంట్రల్:** రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఈనెల 18 నుంచి 24 వరకూ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్ తెలిపారు. 18న నగరంలో అంబేడ్కర్‌భవన్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం వారం రోజుల పాటు అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సులు, ఉచిత వైద్య పరీక్షలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తామన్నారు.

## క్లుప్తంగా

### ప్రతిఇంటా భోగభాగ్యాలు రావాలి

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడురూరల్‌: భోగి మంటల్లో అందరి సమస్యలు మటుమాయమై ప్రతి ఇంటా భోగభాగ్యాలు రావాలని కోరుతూ రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తోపు దుర్తి ప్రకాష్‌రెడ్డి కోరుకున్నారు. పల్లెల్లో సందడి, సరదాలు, జ్ఞాపకాలు పంచే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని ఎమ్మెల్యే అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త కాంతులు రావాలని ఆకాంక్షించారు. మకర సంక్రాంతి సుఖ సంతోషాలు ఇవ్వాలని, కనుమ నమనీయ అనుభూతులు మిగల్చాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడు: ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్‌ బియ్యాన్ని ఇంటింటికీ సరఫరా చేసే ఎండీయూ వాహనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్‌ లక్ష్మీ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఐదు వాహనాల్లో బియ్యం సరఫరా చేయాలన్నారు. రాప్తాడులో ఉన్న 1, 2, 3 దుకాణాలకు కలిపి ఒక వాహనం, ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్‌కు సంబంధించి ఒకటి, అయ్యవారిపల్లి, భోగినేపల్లి, పాలచెర్ల, గాండ్లపర్తి, జి.కొత్తపల్లి, వరిమడుగు గ్రామాలకు కలిపి ఒక వాహనం, ఎం.బండమీదపల్లి, మరూరు, చాపట్ల గ్రామాలకు కలిపి ఒక వాహనం, ఎం.చెర్లోపల్లి, పాలబావి, గొల్లపల్లి, కృష్ణాపురం గ్రామాలకు కలిపి ఒక వాహనంలో ఆయా గ్రామాల్లోని రేషన్‌ దుకాణాల నుంచి ఇంటింటికీ రేషన్‌ సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ఏడో తరగతి పాసై, డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్‌: 9701222506 లో సంప్రదించాలని తహసీల్దార్‌ తెలిపారు.

### ఘర్షణలు సృష్టిస్తే ఉపేక్షించం

కనగానపల్లి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఘర్షణలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదని ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కుర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన కొందరు యువకులు గొడవ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకొన్నారు. తర్వాతా ఇరువర్గాల వారు వెళ్లి కనగానపల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రాజకీయ విభేదాలు, వ్యక్తిగత కక్షలతో ఘర్షణలకు పాల్పడి గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కుర్లపల్లి జరిగిన ఘర్షణపై ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామని, దీనిపై పూర్తిగా విచారించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

### బేస్‌బాల్‌ రాష్ట్ర స్థాయి పోటీలకు కనగానపల్లి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ, హెచ్‌ఎం

కనగానపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయిలో జరిగే బేస్‌బాల్‌ పోటీలకు ఎంపికై నట్లు పీడీ రమేష్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన బేస్‌బాల్‌ క్రీడా పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకు కాకినాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్‌- 14 విభాగంలో వైష్ణవి, అండర్‌- 17 విభాగంలో అనూష, పృథ్వీ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం లక్ష్మీదేవి, చైర్మన్‌ విశ్వనాథ్‌, గ్రామస్తులు అభినందించారు.

### వాటర్‌ షెడ్‌ పథకంతో గ్రామీణాభివృద్ధి

• వాటర్‌షెడ్‌ అడిషనల్‌ పీడీ సుధాకర్‌ రెడ్డి

రాప్తాడు: వాటర్‌షెడ్‌ పథకంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని వాటర్‌షెడ్‌ అడిషనల్‌ పీడీ సుధాకర్‌ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాప్తాడులో విలేకరులతో మాట్లాడారు. వాటర్‌షెడ్‌ అభివృద్ధి నిధి ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన 2.0 కొత్త పనులను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈ పనులకు కాల పరిమితి 5 నుంచి ఏడేళ్ల వరకు ఉంటుందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 32,330 హెక్టార్ల భూమిని అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.90 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం 60, రాష్ట్ర ప్రభుత్వం రూ.40 నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4 వాటర్‌ షెడ్‌ కేంద్రాలుంటాయని వాటిలో ఉరవకొండ, తాడిపత్రి, కదిరి, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఉంటాయన్నారు. వీటిలో 10 ప్రాజెక్టుల కింద 30 గ్రామాల్లో 32,330 హెక్టార్ల ఏరియాను వాటర్‌ షెడ్‌ పథకం కింద అభివృద్ధి చేస్తామన్నారు. ఎంట్రీపాయింట్‌ యాక్టివిటీ (ఈపీఏ) పథకం ద్వారా రూ.1.77 కోట్లు గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. న్యాచురల్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ పథకం ద్వారా రూ.42 కోట్లు ఉంటుందన్నారు. కొండ ప్రాంతాల నుంచి పల్లం వరకు అంటే నీళ్ల వేగంగా వచ్చి భూమిని కోసేయడం జరుగుతుందని, భూమిని రక్షించే పనులు చేస్తామన్నారు. ప్రొడక్ట్‌ సిస్టం ఇంప్రూమెంట్‌, పీఎస్‌ఏ పథకం కింద రూ. 14 కోట్లు నిధులు ఉంటాయన్నారు.

# సంప్రదాయాలను గౌరవించాలి

– డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్‌: సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, ఆచరించాలని డీఆర్‌ఓ గాయత్రిదేవి అన్నారు. శుక్రవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఆవరణలో ముగ్గులపోటీ నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా పరిపాలనాధికారి విజయలక్ష్మి, స్పందన ఇన్‌చార్జ్‌ వాణిశ్రీ వ్యవహరించారు. కార్యక్రమానికి డీఆర్‌ఓ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, దివాకర్‌రావు, కలెక్టరేట్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.

**350 మందికి సంక్రాంతి కానుక**

అనంతపురం క్రైం: డిప్యూటీ మేయర్‌ వాసంతి సాహిత్య ఆధ్వర్యంలో 350 మంది కుటుంబాలకు సంక్రాంతి కానుక అందించేలా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఉమానగర్‌లోని డిప్యూటీ మేయర్‌ వాసంతి సాహిత్య ఇంటి ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్‌ వసీం, డిప్యూటీ మేయర్‌ కోగటం విజయభాస్కర్‌ రెడ్డి, వైఎస్సార్‌ సీపీ నేత అనంత చంద్రారెడ్డి, 13, 14వ డివిజన్‌లోని పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్‌ వాసంతి సాహిత్య తీసుకున్న చర్యలు స్ఫూర్తిదాయకమని మేయర్‌ వసీం, వైఎస్సార్‌ సీపీ నేత అనంత చంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్‌, ఇస్మాక్‌, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్‌ కాగజ్‌ఘర్‌ రిజ్వాన్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు బండి శ్రీకాంత్‌, మారుతీప్రకాష్‌, అట్టే శ్రీనివాసులు, సాయిప్రసాద్‌, జగదీష్‌, పవన్‌, గురు, సోమశేఖర్‌ రెడ్డి, రమేష్‌గౌడ్‌, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉమానగర్‌లో సంక్రాంతి సరుకులను పంపిణీ చేస్తున్న మేయర్‌ వసీం, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత అనంత చంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్‌ వాసంతి



ముగ్గును పరిశీలిస్తున్న డీఆర్‌ఓ గాయత్రిదేవి, చిత్రంలో పరిపాలనాధికారి విజయలక్ష్మి, ఉద్యోగులు

**సందడిగా ముగ్గుల పోటీలు**

అనంతపురం రూరల్‌: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏ నారాయణపురం పంచాయతీలో దక్ష కన్‌స్ట్రక్షన్స్‌ ఎండీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సాంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్‌, వాసంతీ సాహితీ, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు అనంత మాలతీ, అనంత సువర్ణ, కోగటం శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్‌ వాసంతీ సాహితీ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడలన్న ఉద్దేశంతో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం బహుమతులు అందించనున్నట్లు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.



ముగ్గులను పరిశీలిస్తున్న ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు

అనంతపురం కల్చరల్‌: రాయలసీమ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్‌ అప్పిరెడ్డి హరినాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాయలసీమ సంస్కృతి, జీవన స్థితిగతులను ప్రతిబింబించే విధంగా తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి, ఆ చిత్రాలను ఈనెల 15న సాయంత్రం 5 గంటల లోపు 9962544299 వాట్సాప్‌ నంబర్‌కు పంపాలన్నారు.

## భూమిపట్టాతో శాశ్వత జీవనాధారం

అనంతపురం అర్బన్‌: పేదలకు సాగు చేసుకుంటున్న భూమికి పట్టా ఇవ్వడం ద్వారా వారికి శాశ్వతంగా జీవనాధారం కల్పించినట్లేనని రిటైర్డ్‌ తహసీల్దారు జయరామప్ప అన్నారు. శుక్రవారం స్థానిక గణేనాయక్‌ భవన్‌లో 'సాగు భూముల సమస్యలు' అంశంపై ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు జయరామప్పతో పాటు కేవీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ఇచ్చిన సాగుభూమి రక్షించేందుకు ఎందరో చేసిన పోరాట ఫలితంగా 9/77 అసైన్‌మెంట్‌ చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని 2007లో సవరించి 8/2007 చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఆన్‌లైన్‌ వెబ్‌ల్యాండ్‌ రావడంతో పట్టాదారుల పేర్లను, సాగులోలేని వారి పేర్లు చేరుస్తున్నట్లు తెలిపారు. సాగులో ఉన్నట్లు నమోదుకు కొన్ని మండలాల్లో సర్వే అధికారులు రావడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శివారెడ్డి, సూరి, భాస్కర్‌, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్‌ తహసీల్దారు జయరామప్ప

**సాగుభూముల సాధన పోరాట కమిటీ ఎన్నిక :** సదస్సు అనంతరం 29 మంది సభ్యులతో సాగు భూముల సాధన పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా ఎం.కృష్ణమూర్తి, కోకన్వీనర్‌గా వి.శివారెడ్డిని ఎన్నుకున్నారు. సాగుభూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఈనెల 19, 20 తేదీల్లో సచివాలయాల్లో అర్జీలు సమర్పణ, 23న తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పణ, నెలాఖరులో కలెక్టర్‌ కార్యాలయం వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించాలని సదస్సులో తీర్మానం చేశారు.

## ఆర్‌బీకే వేదికగా రైతులకు విస్తృత సేవలు

• అగ్రిబోర్డు మీటింగ్‌లో చైర్మన్‌ ఆలమూరు సుబ్బారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్‌: ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రతిష్టాత్మకంగా గ్రామ గ్రామానా నెలకొల్పిన ఆర్‌బీకేల ద్వారా విస్తృత సేవలు అందిస్తోందని అగ్రిబోర్డు చైర్మన్‌ ఆలమూరు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.శుక్రవారం స్థానిక కృషిభవన్‌లో అనంతపురం రూరల్‌ స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. భూసార సంరక్షణ విభాగం (సాయిల్‌ కన్సర్వేషన్‌) డీడీ జి.తిరుపతయ్యతో కలిసి సుబ్బారెడ్డి మాట్లాడారు. త్వరలో వైఎస్సార్‌ రైతుభరోసా- పీఎం కిసాన్‌ కింద తుది విడతగా రైతు కుటుంబాలకు రూ.2 వేలు చొప్పున విడుదల చేయనన్నారన్నారు. ప్రతి రైతూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈనెల 15 వరకే గడువు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌ కింద నమోదు చేయించుకోవాలన్నారు. భరోసా, సున్నావడ్డీ, ఇన్‌పుట్‌, ఇన్సూరెన్స్‌ పథకాలు వర్తించాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్‌ చేయించుకోవాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా ప్యాక్‌హౌస్‌, ఫారంపాండ్లు లాంటి వాటికి రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు రైతులకు చేరేలా కృషి చేయాలనే అంశంపై చర్చించారు. సమావేశంలో ఎంపీపీ వరలక్ష్మి, హెచ్‌వో చందన, పశువైద్యురాలు ఉష, ఏఈవోలు ప్రసాద్‌, మురళీకృష్ణ, రైతులు రామసుబ్బారెడ్డి, ఈశ్వరయ్య, నాగేశ్వరరెడ్డి, వెంకటప్ప, పరమేష్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అగ్రిబోర్డు చైర్మన్‌ ఆలమూరు వెంకటసుబ్బారెడ్డి

## రూ.2.86 లక్ష రికవరీ చేయండి

• అడిషినల్‌ పీడీ సుధాకర్‌ రెడ్డి
• సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడి



మాట్లాడుతున్న వాటర్‌షెడ్‌ అడిషనల్‌ పీడీ, ప్రిసైడింగ్‌ అధికారి సుధాకర్‌ రెడ్డి

రాప్తాడు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో అక్రమాలకు పాల్పడిన దాదాపు రూ.2,86,000 (రూ. రెండు లక్షలా 86 వేలు) రికవరీ చేయాలని వాటర్‌షెడ్‌ అడిషనల్‌ పీడీ, ప్రిసైడింగ్‌ అధికారి సుధాకర్‌ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై 7 రోజులుగా సామాజిక తనిఖీ అధికారులు విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లు వెల్లడించారు. ఈ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలో రూ. 2,86,000 వేలు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వాటర్‌షెడ్‌ అడిషినల్‌ పీడీ సుధాకర్‌ రెడ్డి, డ్వామా జిల్లా విజిలెన్స్‌ ఆఫీసర్‌ రమణారెడ్డి, ఏపీడీ అయేషా ఆధ్వర్యంలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగింది. 2020 ఏప్రిల్‌ 1 నుంచి 2022 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా 2,642 పనులకు గాను రూ. 27,45,48,049 కోట్ల పనులు చేశారు. ఇందులో ఉపాధిహామీ, హౌసింగ్‌, పంచాయతీ రాజ్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌, సెర్ప్‌, ఎస్‌ఎస్‌ఏ శాఖల్లో జరిగిన పనులపై ఏడు రోజులుగా సామాజిక తనిఖీలు జరిపారు. సామాజిక తనిఖీ బృందం చేపట్టిన అక్రమాలను పంచాయతీల వారిగా చదివి వినిపించారు. ప్రజావేదికలో అక్రమాలను అధికారులు వివరించగా వెంటనే రీకవరీ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అడిషినల్‌ పీడీ సుధాకర్‌ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్‌ రాజ్‌, ఏపీఓలు రామకృష్ణా రెడ్డి, చెన్నకేశవులు, మండల ఇంజనీరు ఓబుల్‌దాస్‌, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి



సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎంపీ తలారి రంగయ్య శుక్రవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. అనంతపురం పార్లమెంటు పరిధిలోని తాడిపత్రి నియోజకవర్గంలోని సజ్జలదిన్నెకు చెందిన ఎంసీ రంగారెడ్డికి సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా రూ. 8 లక్షలు మంజూరయ్యింది. ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గతంలో సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులు అందాలంటే చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. కాని ప్రస్తుతం తమ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా అండగా నిలుస్తున్నారన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ముగ్గురు లబ్ధిదారులకు రూ. 11.25 లక్షల చెక్కు అందించారు. వారిలో అబ్దుల్‌ రూ. 7 లక్షలు, వెంకటలక్ష్మి రూ.25 వేలు, తిమ్మమ్మ రూ.4 లక్షలు చెక్కులను అందించారు.

## రీసర్వేతో స్థిరాస్తిదారుడికి భూరక్ష

• నగరపాలక సంస్థ మేయర్‌ వసీం

అనంతపురం క్రైం: ప్రభుత్వం స్థిరాస్తి దారుడికి భూరక్ష, శాశ్వత హక్కు పత్రం అందించేందుకు రీ సర్వేకు శ్రీకారం చుట్టినట్లు మేయర్‌ వసీం తెలిపారు. రుద్రంపేటలోని డీ మార్ట్‌ వెనుక వైపు ఎరోడైన్‌ ఏజెన్సీ ప్రతినిధులు డ్రోన్‌ సర్వే ట్రైల్‌ రన్‌ శుక్రవారం చేశారు. డ్రోన్‌ సర్వేను మేయర్‌ వసీం, డిప్యూటీ మేయర్‌ వాసంతి సాహిత్య, కమిషనర్‌ కే భాగ్యలక్ష్మి పరిశీలించారు. మేయర్‌ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 16.46 కిలో మీటర్లలో 4,306 ఎకరాల భూమిని సర్వే చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పండుగ తర్వాత మళ్లీ డ్రోన్‌ సర్వే ట్రయల్‌ రన్‌ నిర్వహిస్తామని కమిషనర్‌ కే భాగ్యలక్ష్మి తెలిపారు. ఆ ప్రాంతానికి సంబంధించిన బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ మురళీ కూడా కార్యక్రమానికి ఢుమ్మా కొట్టాడు. డ్రోన్‌ సర్వే ఉదయం 11 గంటలకు చెబితే ఎలా అని అదనపు కమిషనర్‌ రమణారెడ్డి టౌన్‌ ప్లానింగ్‌ విభాగం ప్రణాళిక కార్యదర్శి నరేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ 2 సువర్ణ, ఇన్‌చార్జ్‌ టీపీఓ మహబూబ్‌ జాన్‌ పాల్గొన్నారు.



డ్రోన్‌ సర్వేపై ఆరా తీస్తున్న మేయర్‌ వసీం, డిప్యూటీ మేయర్‌, కమిషనర్‌

**సైపుల్లా బ్రిడ్జికి మెరుగులు దిద్దేలా చర్యలు**

సైపుల్లా బ్రిడ్జికి మెరుగులు దిద్దేలా చర్యలు తీసుకుంటామని మేయర్‌ వసీం తెలిపారు. శనివారం నగరంలోని సైపుల్లా బ్రిడ్జికి జరుగుతున్న పనులను మేయర్‌ పరిశీలించారు. గతంలోనే లైటింగ్‌ సమస్య తన దృష్టికి రావడంతో సత్వర చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం 10వ డివిజన్‌లో పర్యటించిన మేయర అక్కడి పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్పొరేటర్లు గురుశేఖర్‌ బాబు, ఇస్మాక్‌, అనిల్‌కుమార్‌ రెడ్డి పాల్గొన్నారు.

**ఆక్రమణల తొలగింపు :** నగరంలోని శ్రీనగర్‌ కాలనీలో ఆక్రమణల తొలగింపునకు టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు చర్యలు తీసుకున్నారు. నీరు - ప్రగతివనం పార్క్‌ వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తుండగా కమిషనర్‌ కే భాగ్యలక్ష్మి ఆదేశాలతో బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ మురళీ బృందం చర్యలు తీసుకున్నారు. భవన నిర్మాణదారుడు జీప్లస్‌ 4 అనుమతి తీసుకొని అదనంగా మరో ఫ్లోర్‌ వేస్తుండడంతో బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ మురళీ ఫ్లోర్‌ను శుక్రవారం తొలగించారు.

**పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి :** ఇంటి, నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని అదనపు కమిషనర్‌ రమణారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం 50వ డివిజన్‌లోని 72వ సచివాలయాన్ని అదనపు కమిషనర్‌ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు.

**ఫిల్ట్రేషన్‌ పాయింట్‌ తనిఖీ :** ముద్దలాపురంలోని ఫిల్ట్రేషన్‌ పాయింట్‌ను నగరపాలక సంస్థ కమిషనర్‌ కే భాగ్యలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. నీటిశుద్ధి క్రమ పద్ధతిలో చేస్తున్నారా లేదా? టర్బిడిటీ ఏస్థాయిలో ఉందని ఆరాతీశారు. అలం మిశ్రమాన్ని సమపాళ్లలో కలుపుతున్నారా లేదా? అని తెలుసుకున్నారు. నీటి సరఫరా విభాగం అధికారులు ఎప్పటికప్పుడు ఫిల్ట్రేషన్‌ పాయింట్‌ పరిశీలించాన్నారు. అనంతరం కమిషనర్‌ ఆలమూరు లే అవుట్‌ను తనిఖీ చేశారు. ఏఈ సాయి, అమినిటీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## వైభవం..గోదారంగనాథుల కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్‌: స్థానిక అరవిందనగర్‌లోని శ్రీకృష్ణ ఆశ్రమంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో వేదపండితులు బాలాజీ శర్మ, మణూరు నాగరాజశర్మ గోదాదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఎదురుకోళ్లు, తలంబ్రాలు, మాంగల్యధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్వాహకులు విజయ్‌సాయి, ఆలయఅనువంశీకులు మీరారాణి, దివ్య, రాఘవేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు. మారుతీనగర్‌లోని కోదండరామాలయంలో గోదాదేవి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది.



మారుతీనగర్‌లో కల్యాణ పూజలందుకున్న గోదాదేవి

### ట్రాక్టర్‌ కింద పడి కూలీ మృతి



సంగప్ప (ఫైల్‌)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: స్థానిక ఆరో రోడ్డులో నగర పాలక సంస్థకు చెందిన చెత్త తరలించే ట్రాక్టర్‌ కింద పడి కూలీ వడ్డే సంగప్ప (55) శుక్రవారం మృతి చెందారు. ట్రాఫిక్‌ పోలీసులు, స్థానికులు వివరాల మేరకు.. ఆరోరోడ్డు శ్మశాన వాటిక సమీపంలో నివాసం ఉంటున్న సంగప్ప మట్టి పనులకు వెళ్లే కూలి. ఆయనకు భార్య నారాయణమ్మ, కుమార్తెలు సంగమ్మ, శివమ్మ, వరలక్ష్మి, రాజశ్వరితో పాటు ఒక కుమారుడు శివయ్య ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమార్తెలు అంగవికలురు. సంగప్పే పెద్ద దిక్కు. రోజువారి కూలీకి వెళితేనే మూడు పూటల అన్నం.. లేదంటే ఉపవాసం ఉండాల్సిందే. సంగప్ప శుక్రవారం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి సైకిల్‌పై పనికి బయల్దేరాడు. నిచ్చెన భుజాన వేసుకుని సైకిల్‌ తొక్కుకుంటూ వెళ్తున్న సంగప్ప ఆరో రోడ్డులో ఎదురుగా వస్తున్న చెత్త ట్రాక్టరును దాటబోయాడు. ఈ క్రమంలో భుజం మీదున్న నిచ్చెన ట్రాక్టరుకు తగులుకోవడంతో సంగప్ప కుడివైపుకు వాలిపోయాడు. వెనుక టైరు సంగప్ప తలపై ఎక్కింది. ఇంటిపెద్ద మృతిచెందడంతో కుటుంబ సభ్యు లు రోదించిన తీరు స్థానికులను కలచివేసింది. ట్రాఫిక్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ :** సంగప్ప కుటుంబాన్ని నగర మేయర్‌ వసీం, డిప్యూటీ మేయర్‌ కోగటం విజయభాస్కరరెడ్డి, 42వ డివిజన్‌ కార్పొరేటర్‌ రహంతుల్లా, 41వ వార్డు కార్పొరేటర్‌ రాధా, నగర పాలక సంస్థ అధికారులు పరామర్శిం చారు. బాధిత కుటుంబ సభ్యులకు ఓదార్చి, భరోసా ఇచ్చారు.

### మైనార్టీ గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న యునైటెడ్‌ జేఏసీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్‌ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ సభ్యులు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి విన్నవించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వారు కలిసి, సమస్య విన్నవించారు. వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలను గార్లదిన్నె సమీపంలో జూనియర్‌ కళాశాలలో నిర్వహిస్తున్నారన్నారు. కనీస మౌలిక వసతులు లేకుండా విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యపరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో యునైటెడ్‌ జేఏసీ నాయకులు జాఫర్‌, అబ్దుల్‌ రసూల్‌, దాదాగాంధీ, వలి, గోల్డ్‌ బాషా, ముదస్సీర్‌ మౌలానా, ఖాజా గౌసుల్‌వరా, గౌస్‌పీర్‌ పాల్గొన్నారు.

### సింగిల్‌ విండో అధ్యక్షుడికి పరామర్శ



మద్దిరెడ్డి శివారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్‌

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: చియ్యేడు సింగిల్‌ విండో అధ్యక్షుడు మద్దిరెడ్డి శివారెడ్డిని తాడిపత్రి ఎమ్మెల్యే కెతిరెడ్డి పెద్దారెడ్డి, రాప్తాడు మార్కెట్‌ యార్డు చైర్మన్‌ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు ధనుంజయ యాదవ్‌ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల శివారెడ్డి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### 18 నుంచి సీఐటీయూ మహాసభలు

అనంతపురం అర్బన్‌: సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలు ఈనెల 18 నుంచి 22 వరకు బెంగళూరులో జరగనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్‌ అన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షురాలు నాగమణి, నాయకులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఐదు రోజుల పాటు జరగనున్న మహాసభల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి, ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, వెంకటనారాయణ, ప్రభాకర్‌, తదితరులు పాల్గొన్నారు.

### రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్‌ లక్ష్మీ నరసింహులు

రాప్తాడు: రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్‌ లక్ష్మీ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గంగలకుంట, బొమ్మేపర్తిలో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేపడుతోందన్నారు. గంగలకుంటలో రీ సర్వే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఇప్పటికే బొమ్మేపర్తి లో రీసర్వే కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌ గోపినాథ్‌, మండల సర్వేయర్‌ రామాంజనేయులు, వీఆర్వోలు గీత, లింగా రెడ్డి, సర్వేయర్లు గంగాధర్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 303 | 98 |
| 60,261 | 17,957 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 10,978 | ▽ | 23 |
| డోజోన్స్ | 34,193 | ▲ | 3 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,844 | ▲ | 50 |
| డాక్స్ | 15,087 | ▲ | 28 |
| షాంఘై | 3,195 | ▲ | 31 |
| నికాయ్ | 26,120 | ▽ | 330 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ రూ.లలో

ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | | |
| 56,462 | ▲ | 352 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | | |
| 56,236 | ▲ | 351 |
| వెండి (కిలో) | | |
| 68,115 | ▲ | 90 |

## ఫారెక్స్ రేట్లు రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 79.50 | 83.18 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 96.84 | 101.69 |
| € | యూరో | | 85.71 | 90.23 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 50.00 | 76.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | | 54.20 | 59.09 |
| S$ | సింగపూర్ డాలర్ | | 59.21 | 63.76 |
| SAR | సౌదీ రియాల్ | | 20.69 | 22.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 21.25 | 23.04 |
| ¥ | చైనా యువాన్ | | 10.98 | 13.01 |

### డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

### క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 14-1-2023 | |
|---|---|
| విశాఖ | 572-00 |
| చిత్తూరు | 568-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 563-00 |
| విజయవాడ | 563-00 |
| రిటైల్ ధర (డజను) | 84.00 |
| **13-1-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 563-00 |
| వరంగల్ | 565-00 |
| రిటైల్ ధర | 6.20 |

# విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.




ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

**డీల్స్ రికార్డ్..**

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఇతర హైలైట్స్**

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

# 3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్ల దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

**కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్**

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్‌ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్‌అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.



**స్టాక్ హైలైట్స్**

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్‌ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

# ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం



చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇతర రంగాలకూ పీఎల్‌ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్‌ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60




శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.

**పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు**

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్‌ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్‌ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్‌ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్‌ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్‌ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్



## నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

# టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

## వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



# భారత్ శుభారంభం

**నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.**

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.


అమిత్ రోహిదాస్

**8** ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

## సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## ఆంధ్ర జట్టుకు నిరాశ

### ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.


హిమ్మత్

# భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరో వైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

**టెస్టు జట్టు వివరాలు:** రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.


సూర్య, ఇషాన్


## న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

# టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

## న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.


భరత్

**వన్డే జట్టు:** రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.